క్లుప్తంగా

బిడ్డకు తల్లిపాలు శ్రేష్ఠం



పోషకాహార కిట్లు అందుకున్న గర్భిణులు

కపిలేశ్వరపురం: బిడ్డకు తల్లిపాలు శ్రేష్ఠమని వల్లూరులో బుధవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. సర్పంచ్ దాసి మీనాకుమారి, పంచాయతీ కార్యదర్శి తాతపూడి సుభాకర్, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చేంబ్రోలు వీరభద్రరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.వెంకటలక్ష్మి చేతుల మీదుగా టేక్ హోమ్ రేషన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణి, బాలింతలకు పోషకాహార కిట్లు అందజేశారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ గెద్దం ప్రమీల, గర్భిణుల సహాయకులు, అంగన్‌వాడీ, ఆశ, వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగరలో ప్రత్యేక పారిశుధ్య పనులు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర గ్రామంలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. దోమల నివారణకు పారిశుధ్య కార్మికులు డ్రైన్లలోని పూడికను తొలగించారు. దోమల మందును పిచికారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. నివాసితులు చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లో వేయాలని, చెత్తను తరలించే వాహనం వచ్చినప్పుడు పారిశుధ్య కార్మికులకు సహకరించాలన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు కాకినాడ ఏపీఈపీడీసీఎల్ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం సబ్‌స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ కాజులూరు, తిప్పరాజుపాలెం, అయితపూడి, ఒంటితాడి తదితర గ్రామాల గృహ వినియోగదారులకు, రొయ్యల చెరువులు, ఇండ్రస్టియల్ ఫీడర్ పరిధిలోని వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందన్నారు. అంతరాయానికి చింతిస్తున్నామని సహకరించాలన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 170 అడ్మిషన్లు

రామచంద్రపురం: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి విడత కౌన్సెలింగ్‌లో 200 మంది అలాట్‌మెంట్ కాగా బుధవారం నాటికి 170 అడ్మిషన్లు జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేసీ సత్యలత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండో విడత, మూడో విడత అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుందని విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు 88853 49991, 78933 97425 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కె.గంగవరం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పామర్రు పీహెచ్‌సీ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని పీహెచ్‌సీ వైద్యులు మాణిక్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి ఆయా పాఠశాలలకు వైద్య సిబ్బంది చేరుకుని విద్యార్థులతో మాత్రలు మింగిస్తారని ఒకటి నుంచి 18 సంవత్సరాల్లో వయసున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాత్రలు వేసుకోవాలని తద్వారా ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు.

పట్టణ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా రవికుమార్

రామచంద్రపురం: ఏపీ ఈపీడీసీఎల్ పట్టణ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా యల్లమిల్లి రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయన పట్టణ ఏఈ మేడిశెట్టి వెంకటరమణకు ఆర్డర్ కాపీని అందజేసి బాధ్యతలు స్వీకరించారు. రాయవరం మండలం నదురుబాద లైన్‌మన్‌గా పనిచేస్తున్న రవికుమార్ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. జేఈ కె.సీతారామదొర, లైన్ ఇన్‌స్పెక్టర్ జాన్ సుధాకర్, లైన్‌మన్‌లు లోవరాజు, గోవిందు, వి.రవి, గోవిందు, రామకృష్ణ, ప్రసాద్ తదితరులు అభినందనలు తెలిపారు.

నేటి ధర్నాను జయప్రదం చేయండి

రామచంద్రపురం/రామచంద్రపురం రూరల్: గ్రామీణ తపాలా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనలో భాగంగా నేడు రాజమహేంద్రవరం పోస్టల్ డివిజన్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం డివిజన్ కార్యదర్శి పి.భూలోకం బుధవారం ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గ్రామీణ తపాలా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు నాలుగు అంచెల పోరాట కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. అందులో భాగంగా నేడు డివిజనల్ కార్యాలయాల వద్ద ధర్నా జరుగుతుందని పేర్కొన్నారు. అప్పటికీ కూడా డిమాండ్లకు కేంద్రప్రభుత్వం ప్రకటన చేయకపోతే యూనియన్ కేంద్ర నాయకత్వం ఆదేశాల మేరకు డిసెంబర్ 12వ తేదీ నుంచి నిరవధిక సమ్మెను చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ముమ్మరంగా ఓటరు జాబితా రీ సర్వే

- సర్వేలో బూత్‌లెవెల్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు
- ఈ నెల 21వ తేదీతో పూర్తి
- నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,14,790
- ఇప్పటి వరకూ సర్వే చేసినవి 1,08,526



మారేడుబాకలో రీ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

మండపేట: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నియోజకవర్గంలో ఓటర్ల స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్) ముమ్మరంగా జరుగుతోంది. బూత్ లెవిల్ అధికారులతో పాటు అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులు ఇంటింట సర్వే చేస్తున్నారు. గత నెల 21న మొదలైన సర్వే ప్రక్రియ ఈనెల 21వ తేదీ వరకూ కొనసాగుతోంది.

ఓటరు జాబితాలన సవరించేందుకు ఎన్నికల కమిషన్ ఏటా ఎస్ఎస్ఆర్సీ నిర్వహిస్తోంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు నిర్వహించే ఎస్ఎస్ఆర్సీకి ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. ఎన్నికలు లేని సంవత్సరాల్లో జరిగే ఈ ప్రక్రియను రాజకీయ పార్టీలు అంతగా పట్టించుకోవు. ఎన్నికల ముందు జరిగే ఎస్ఎస్ఆర్సీకి ఎంతో కీలకంగా తీసుకుంటాయి. ఏ చిన్న తప్పుకు ఆస్కారం లేకుండా తమ పార్టీ సానుభూతి ఓటర్లు అందరూ జాబితాలో ఉన్నారో లేదో ఆయా పార్టీల బూత్ లెవిల్ ఏజెంట్లు క్షుణ్ణంగా పరిశీలిస్తుంటారు. అర్హత కలిగిన కొత్త ఓటర్ల చేరికల్లో తలమునకలై ఉంటారు. ఓటర్ల రీ సర్వేపై ఇప్పటికే రాజకీయ పార్టీల ప్రతినిధులతో నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి ఎస్. సుధాసాగర్ అవగాహన సమావేశాలు నిర్వహించారు.

ఇంటింట సర్వే

ఈసీ షెడ్యూల్ మేరకు ప్రస్తుతం ఎస్ఎస్ఆర్సీ ఇంటింట సర్వే జరుగుతోంది. బూత్ లెవెల్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తమ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఇంటిలోని మొత్తం జనాభా ? ఎంతమంది ఓటర్లు ఉన్నారు?, 18 ఏళ్ల నిండి ఓటుహక్కు నమోదు చేసుకోవాల్సిన వారెందరున్నారు? మరణించిన లేదా ఒక వ్యక్తి రెండు అంతకంటే ఎక్కువ ఓట్లు నమోదు చేసుకుని ఉన్నారా?, ఓటరు జాబితాలో పేర్లు నమోదై తప్పులు సవరణ చేయాల్సి ఉందా? తదితర అంశాలపై సర్వే చేస్తున్నారు. వాటికి సంబంధించిన మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదుకు సంబంధిత వ్యక్తుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. సర్వే ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా తహసీల్దార్లు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇంటింట సర్వేను పరిశీలిస్తున్నారు.

నియోజకవర్గంలో మొత్తం 79,565 ఇళ్లు ఉండగా 2,14,790 మంది ఓటర్లు ఉన్నారు. బుధవారం నాటికి 40,487 ఇళ్ల పరిధిలోని 1,08,526 మంది ఓటర్లను సర్వే చేశారు. తొలగింపులకు సంబంధించి 2,804 దరఖాస్తులు రాగా సవరణలు, బదిలీలకు సంబంధించి 1343 దరఖాస్తులు వచ్చాయి. కొత్తగా నమోదుకు సంబంధించి 1,790 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

నియోజకవర్గంలో సర్వే వివరాలు కింది విధంగా ఉన్నాయి

మండలం	ఇళ్ల సంఖ్య	ఓటర్లు	సర్వే చేసినవి
మండపేట రూరల్	23,390	62,861	23,531
మండపేట టౌన్	16,014	46,789	24,958
రాయవరం	20,233	52,775	28,830
కపిలేశ్వరపురం	19,958	52,365	31,207

> **రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి**
>
> పూర్తి పారదర్శకంగా ఇంటింట రీ సర్వే జరుగుతోంది. బూత్ లెవిల్ అధికారులతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొంటున్నారు. కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, సవరణలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. నియోజకవర్గ ప్రజలు ఓటరు రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి.
>
> –సుధాసాగర్, ఓటరు నమోదు అధికారి, మండపేట నియోజకవర్గం

పేదల చెంతకే ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- మండపేట 5,6 వార్డుల్లో గడప గడపకూ..



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా క్షేత్రస్థాయిలో పేదల చెంతకే ప్రభుత్వ పథకాల లబ్ధి అందుతోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు తదితరులతో కలసి పట్టణంలోని 5, 6 వార్డుల పరిధిలోని టీచర్స్ వీధి, తర్వాణీపేట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ ప్రగతిని ప్రజలకు వివరించారు. పథకాలు అందుతున్నాయా?, ఏమైనా సమస్యలు ఉన్నాయా? అంటూ స్థానికులను యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తన దృష్టికి తెచ్చిన ఆయా సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కమిషనర్ టి రామ్‌కుమార్, అధికారులకు ఆదేశాలిచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమయ్యేందుకు చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజా అవసరాలు గుర్తించేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉందన్నారు. కౌన్సిలర్లు ఏర్నేని ప్రభావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, టౌన్, రూరల్ కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, శెట్టిబలిజ సంఘం టౌన్ అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, దేవస్థానం చైర్మన్లు సూరంపూడి సత్యప్రసాద్, లేగా వెంకన్న, పార్టీ నాయకులు ఓగిరాల దేవి, బెల్లపుకొండ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

తపాలా కార్యాలయంలో జాతీయ జెండాల విక్రయం



మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవికి జాతీయ పతాకాన్ని అందిస్తున్న ఇన్‌స్పెక్టర్ తదితరులు

రామచంద్రపురం: కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలో గల అన్ని తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాలను విక్రయిస్తున్నట్లు సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎం.లక్ష్మణ్‌కుమార్ వెల్లడించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవికి ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌కుమార్ జాతీయ పతాకాన్ని బుధవారం అందజేశారు. చైర్ పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రధాన తపాలా కార్యాలయంలో విక్రయిస్తున్న జాతీయ జెండాలను తీసుకుని ఆగష్టు 15న జాతీయ జెండాలను ఎగురవేయాలని సూచించారు. ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు అన్ని తపాలా కార్యాలయాల్లో జెండాలు అందుబాటులో ఉంటాయని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, మెయిల్ ఓవర్‌సీస్ ఆర్.శ్రీనివాసరావు, హెడ్ పోస్టుమాస్టర్ బి.విఠల్‌నాథ్, ఏబీపీఎం సీహెచ్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

68 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



అంగర పీహెచ్‌సీలో గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రత్నకుమారి

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, అచ్యుతాపురం, వాకతిప్ప పీహెచ్‌సీల్లో 68 మంది గర్భిణులకు బుధవారం వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. 14 మందిని హైరిస్క్‌గా గుర్తించి మెరుగైన పరీక్షలకు సిఫార్సు చేశారు. ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు పీఎస్ఎస్‌డీ రత్నకుమారి పి.చంద్రమౌళి, కరుణేంద్రకుమారి పర్యవేక్షణలో పరీక్షలు చేశారు. అంగర పీహెచ్‌సీలో 23 మంది గర్భిణులను పరీక్షించారు. ఆరుగురుని హై రిస్క్‌గా గుర్తించారు. గ్రామానికి చెందిన వ్యాపారవేత్త రాగం రామచంద్రరావు గర్భిణులకు బిస్కెట్లు, ఆపిల్ జ్యూస్ డ్రింక్స్ అందజేశారు. వాకతిప్ప పీహెచ్‌సీలో డాక్టర్ పి.చంద్రమౌళి 20 మందిని పరీక్షించగా నలుగురుని హైరిస్క్‌గానూ, అచ్యుతాపురం పీహెచ్‌సీలో డాక్టర్ కరుణేంద్రకుమారి 25 మందిని పరీక్షించగా, నలుగురుని హైరిస్క్‌గా గుర్తించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, ఎంపీహెచ్ఎస్‌లు పి.సురేష్, కామేశ్వరరావు, ఎస్.నూకరాజు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తే దుష్పరిణామాలు



మండపేటలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

మండపేట: శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని సరైన రీతిలో వినియోగించుకోవాలని, లేదంటే విపరీత పరిణామాలు చవి చూడాల్సి వస్తుందని ఎంఈఓ సోమిరెడ్డి అన్నారు. డీఈఓ కమలకుమారి ఆదేశాల మేరకు జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో పట్టణంలోని గౌతమి మున్సిపల్ హైస్కూల్లో హిరోషిమా నాగసాకి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులతో బుధవారం నిర్వహించిన ర్యాలీని ఎంఈఓ సోమిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1945లో హిరోషిమా, నాగసాకిపై అమెరికా చేసిన అణుబాంబు దాడుల వేలాది మంది ప్రజలు చనిపోయారని, అణు ధార్మిక దుష్పరిమాణాలను ఇప్పటికీ అక్కడి ప్రజలు చవి చూస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ అణ్వాయుధాల నివారణ లక్ష్యంగా విద్యార్థులు మండపేట పట్టణంలో ర్యాలీ చేశారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, డ్రాయింగ్ పోటీల విజేతల పేర్లను ప్రకటించారు. త్వరలో వీరికి బహుమతులు అందజేయనున్నట్టు హెచ్ఎం శోభావళి తెలిపారు. కార్యక్రమం కోఆ–ర్డినేటర్ రామలక్ష్మి, ఉపాధ్యాయులు సూర్యలత, రామచంద్రారెడ్డి, సూర్యప్రకాష్, ప్రసాద్, అరుణ కిషోర్, రోజా, రజియా బేగం, రూపవతి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన టీచర్లకు సత్కారం



సత్కారం అందుకున్న బదిలీ ఉపాధ్యాయులతో పాఠశాల ప్రస్తుత సిబ్బంది

కపిలేశ్వరపురం: మాచర జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన 11 మంది ఉపాధ్యాయులను ప్రస్తుత ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. పాఠశాలలో బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. సత్కారం అందుకున్న బదిలీ ఉపాధ్యాయులు దుర్గా ప్రసాదరావు, జె.శ్రీనివాస్, మల్లేశ్వరరావు, జీవరత్నం, రాజ్‌కుమార్, వీరప్రసాద్, విజయ్‌కుమార్, ప్రభాకరరావు, శ్యామల, కృపామణి, సూర్యచంద్రరావు, విశ్రాంత ఉపాధ్యాయులు ఇళ్ళ వెంకట్రావు, జోసెఫ్‌లు మాట్లాడుతూ మాచర పాఠశాలలో విద్యాబోధన సంతృప్తి ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వాడ్రేవు శ్రీనివాసరావు, వెంకట్, రాజశేఖర్, విశ్వనాథ్, బాలు ,వీరబాబు, శ్రీహరి పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణాలు



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం: పురపాలక పరిధిలో 15 ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు. పట్టణంలోని 28వ వార్డు రామదుర్గ వీధిలో రూ.7 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను చైర్‌పర్సన్ శ్రీదేవి బుధవారం ప్రారంభించి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అవసరమైన చోట ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే పట్టణ సమగ్రాభివృద్ధికి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ సూచనల మేరకు ప్రణాళికలు వేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నేత కుడిపూడి గణేష్, డీఈ డి.దుర్గాప్రసాద్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం

మండపేట: అయినవారిని కోల్పోయి ఆపదలో ఉన్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని 11వ వార్డు కౌన్సిలర్ కొవ్వాడ బేబి అన్నారు. ఇటీవల న్యూ కాలనీకి చెందిన ఎన్.భాస్కరరావు అకాల మరణం చెందగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో అతని కుటుంబానికి రూ.లక్ష బీమా సాయం మంజూరైంది. ఈ సందర్భంగా మట్టి ఖర్చుల నిమిత్తం విడుదలైన రూ.10,000 ఆర్థిక సాయాన్ని బుధవారం భాస్కరరావు కుటుంబ సభ్యులకు కౌన్సిలర్ బేబీ, వైఎస్సార్ సీపీ నేత అప్పన్నబాబు దంపతులు అందజేశారు. మిగిలిన రూ 90 వేలు వారం రోజుల్లో నామినీ అకౌంట్‌కు జమవుతాయన్నారు. వెల్ఫేర్ సెక్రటరీ లోకేష్, మహిళా పోలీస్ తపస్వి, వలంటీర్ సునీత పాల్గొన్నారు.

నేడు చెల్లూరులో గడప గడపకూ..

రాయవరం: మండలంలోని చెల్లూరు పంచాయతీలో గురువారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ విషయాన్ని ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి బుధవారం తెలిపారు.

ఇంటింటి సర్వేను సద్వినియోగం చేసుకోవాలి



రాయవరంలో బూత్ లెవెల్ అధికారుల సమావేశంలో పాల్గొన్న అధికారులు

రాయవరం: ప్రత్యేక సమ్మరీ రివిజన్–2024లో భాగంగా నిర్వహించే ఓటరు సర్వేను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబు, మండపేట ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు పి.అవతార్ మెహర్ బాబా అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాల్లో బుధవారం బూత్ లెవల్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రకాష్‌బాబు, అవతార్ మెహర్ బాబాలు మాట్లాడుతూ ఎటువంటి తప్పొప్పులకు అవకాశం లేకుండా, సమర్థవంతంగా సర్వే నిర్వహించాలన్నారు. సర్వేలో భాగంగా ఇంటిలో ఎంత మంది ఓటర్లున్నారు..18 ఏళ్లు నిండి ఓటరుగా నమోదు చేసుకోవాల్సిన వారు ఎంత మంది, మరణించి లేదా ఒక వ్యక్తి రెండు లేదా అంతకంటే ఎక్కువ ఓట్లు నమోదు చేసుకుని ఉన్నారా..ఓటరు లిస్టులో పేర్లు నమోదై ఉండి, తప్పులు, పొరపాట్లు ఏమైనా ఉంటే సవరణ చేయాల్సి ఉందా..తదితర విషయాలపై సర్వే చేస్తారన్నారు. ఈ నెల 21 వరకు జరిగే సమ్మరీ రివిజన్‌నుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రతీ వివరాలను బీఎల్‌వో యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సందడిగా నా భూమి- నా దేశం



మారేడుబాక వేడుకల్లో ఎంపీడీఓ రాజు, తహసీల్దార్ రాజేశ్వరరావు



వెదురుపాకలో శిలాఫలకాన్ని ఆవిష్కరించి, పూజలు చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కాజులూరులో మొక్క నాటుతున్న మంత్రి తనయుడు నరేన్, జెడ్పీటీసీ వెంకటసుబ్బారావు తదితరులు



వెంకటాయపాలెంలో నా భూమి-నా దేశం శిలాఫలకం ప్రారంభించిన ప్రజాప్రతినిధులు

శిలాఫలకాల ఆవిష్కరణ

మండపేట: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలో బుధవారం నా భూమి- నా దేశం, నేల తల్లికి నమస్కారం- వీరులకు వందనం కార్యక్రమాలు సందడిగా మొదలయ్యాయి. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు గ్రామగ్రామానా ఆజాదీకా అమృత్‌మహోత్సవ్ లోగో, ప్రధానమంత్రి సూక్తి, స్థానిక వీరుల పేర్లు, పంచాయతీ పేరుతో ప్రత్యేకంగా తయారు చేయించిన శిలా ఫలకాలను ఆయా పంచాయతీ సర్పంచులు ఆవిష్కరించారు. అనంతరం సెల్ఫీలు తీసుకుని ప్రత్యేక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. మట్టిని తీసుకుని పంచప్రాణ ప్రతిజ్ఞ చేశారు. మారేడుబాకలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ ఐ. రాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజులు, ఎంపీటీసీ సభ్యురాలు చొల్లంగి సత్యవేణి, గ్రామ కార్యదర్శి సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమర యోధులకు వందనం

కపిలేశ్వరపురం: మండలంలోని పడమర ఖండ్రికలో 'నా భూమి – నాదేశం', 'నేలతల్లికి నమస్కారం' –వీరులకు వందనం' పేరుతో శిలాఫలకాన్ని నియోజకవర్గ సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు యర్రంశెట్టి నాగేశ్వరరావు ప్రారంభించారు. గ్రామ పౌరులతో ప్రమాణం చేయించారు. వక్తలు మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాల ఫలితంగానే ఆధునిక మానవుడు సుఖ సంతోషాలతో జీవించ గలుగుతున్నాడన్నారు. వారి త్యాగాన్ని సదా స్మరించుకునే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సీహెచ్ నరసింహారావు, ఇతర సచివాలయ ఉద్యోగులు, పాఠశాల విద్యార్థులు, వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే కాలుష్య నివారణ సాధ్యం

కాజులూరు: పర్యావరణ పరిరక్షణతోనే కాలుష్య నివారణ సాధ్యమౌతుందని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ తనయుడు నరేన్ అన్నారు. బుధవారం కాజులూరులో జరిగిన 'నా భూమి–నాదేశం', నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమంలో మంత్రి తనయుడు నరేన్, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావులు పాల్గొని మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం గ్రామాల్లో నా భూమి-నాదేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించి 75 మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటడం ద్వారా గాలిలో కార్బన్‌డైఆక్సైడ్‌శాతం తగ్గి కాలుష్య నివారణ సాధ్యమౌతుందన్నారు. ఎంపీపీ మాత భారతి, పార్టీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, సర్పంచ్ దండంగి సరోజిని, పార్టీ నాయకులు యాళ్ళ సత్తిబాబు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ, మేడిశెట్టి సూరిబాబు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు గుర్తు చేసుకోవాలి

రాయవరం: స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా అమరుల త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. నదురుబాద, వెదురుపాక, కురకాళ్లపల్లి గ్రామాల్లో బుధవారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ నిర్వహించారు. సర్పంచ్‌లు చింతపల్లి శ్రీనివాసరావు, మల్లిడి సూరారెడ్డి, పిల్లి శారద ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తొలుతగా అమృత్ సరోవర్ పథకంలో భాగంగా అభివృద్ధి పర్చిన చెరువు దగ్గర నిర్మించిన శిలాఫలకానికి వద్ద పూజలు నిర్వహించారు. చెరువు వద్ద మొక్కలు నాటారు. వీరులకు వందనం సత్కారం కార్యక్రమంలో భాగంగా వెదురుపాకలో అమరుడైన సైనికుడి భార్య ఒంటిమి బాల సరస్వతిని దుశ్శాలువాతో సత్కరించారు.ఆయా గ్రామాల్లో మట్టిని సేకరించి, మండలానికి పంపించారు. దేవస్థానం చైర్మన్లు టేకుమూడి రాంబాబు, తాడి బులివెంకటరెడ్డి, ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ రామచంద్రపురం క్లస్టర్ ఏపీడీ సత్యనారాయణ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జె.సుధారాణి, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధి హామీ కూలీలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్‌లో..

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెం, వెల్ల గ్రామాల్లో బుధవారం నా భూమి-నా దేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వెంకటాయపాలెం జెడ్పీ హైస్కూల్‌లో సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, ఎంపీటీసీ కణితి వెంకటేశ్వరి, రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వెలంపాలెం, కాపవరం ఎంపీటీసీలు తుమ్మూరి సుబ్బలక్ష్మి, రెడ్నం సతీష్ తదితరులతో కలసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి సందేశాలు, ఆజాదీకా అమృత్ మహోత్సవ్ లోగో, స్వాతంత్య్ర సమరయోధుల పేర్లు తదితర వివరాలతో కూడి శిలాఫలకాన్ని ప్రారంభించారు. కొబ్బరి మొక్కను నాటి దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు అధికారులు పాల్గొన్నారు.

